సాక్షి
ఖమ్మం

సోమవారం । 22 । సెప్టెంబర్ । 2025

లెక్కలేని తనం..

అసలే నిధులు లేక కునారిల్లుతుండగా.. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ సహా పలు మున్సిపాలిటీలకు కేంద్రం నిధుల్లోనూ మొండిచేయి ఎదురైంది. కొంతకాలంగా రాష్ట్రప్రభుత్వం నుండి ఎలాంటి నిధులు రాక ఉద్యోగులకు జీతాలు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. ఈ సమయాన కేంద్రప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక సంఘం నిధులు కూడా కేఎంసీతో పాటు ఉమ్మడి జిల్లాలోని పలు మున్సిపాలిటీలకు అందలేదు. అయితే, కేఎంసీకి నిధులు రాకపోవడానికి అధికారుల నిర్లక్ష్యమే కారణమన్న చర్చ జరుగుతోంది. – ఖమ్మంమయూరిసెంటర్



ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

పన్నుల లక్ష్యం దాటితేనే కేంద్రం నుంచి నిధులు

- కేఎంసీ సహా పలు మున్సిపాలిటీలకు ఈసారి మొండిచేయి
- పన్ను డిమాండ్ ఎక్కువగా చూపించడమే కారణం?
- కొందరి నిర్లక్ష్యంతో రూ.12కోట్లకు పైగా నష్టం

నిధులు మంజూరు ఇలా..

నగర, పురపాలక సంస్థలకు కేంద్రప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులను విడుదల చేస్తుంటుంది. 2023–24 ఏడాదిలో ఆస్తి పన్ను లక్ష్యాలను అధిగవిుంచిన మున్సిపాలిటీలకు, కార్పొరేషన్లకు ఈ ఏడాది మార్చిలో మొదటి విడతగా, ఈనెల 18న రెండో విడతగా నిధులు మంజూరయ్యాయి. ఉమ్మడి జిల్లాలోని సత్తుపల్లి, వైరా, ఇల్లెందు, పాల్వంచ మున్సిపాలిటీలకు నిధులు విడుదలైనా, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్, కొత్తగూడెం, మధిర మున్సిపాలిటీలకు దక్కలేదు. రెండు విడతల్లోనూ కేఎంసీకి నిధులు జమ కాకపోవడం గమనార్హం.

నిర్లక్ష్యమే కారణం?

ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో ఆస్తిపన్నుల వసూళ్లను అధికారులు కొన్నేళ్లుగా ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నారు. ప్రభుత్వం విధించే లక్ష్యాలకు మించి వసూలు చేస్తున్నారు. ఇదే సమయాన రెవెన్యూ విభాగం అధికారులు తమ విధుల్లో నిర్లక్ష్యం వీడకపోవడంతోనే 15వ ఆర్థిక సంఘం నిధులు కేఎంసీకి రాలేదని తెలుస్తోంది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో కేఎంసీ ఆస్తిపన్నుల రూపంలో రూ.27 కోట్లు వసూలు చేస్తే, 2023–24లో రూ.29 కోట్లకు పైగా లక్ష్యాన్ని నిర్ణయించారు. కానీ రెవెన్యూ అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్ల తప్పిదాలతో ఒకే ఇంటికి నాలుగైదు అసెస్మెంట్ నంబర్లు నమోదైనా డబుల్ అసెస్మెంట్లు తొలగించకపోవడం తదితర కారణాలతో ఆస్తి పన్ను లక్ష్యం ఆన్‌లైన్‌లో రూ.35 కోట్ల మేర చూపించినట్లు తెలుస్తోంది. దీంతో ఆ స్థాయిలో పన్నులు వసూలు కాక ఆర్థిక సంఘం నిధుల్లో మొండిచేయి ఎదురైనట్లు సమాచారం.

రూ.12కోట్లకు పైగానే..

నిర్దేశిత జనాభా లేని కార్పొరేషన్లకు వసూలైన పన్నుల ఆధారంగానే ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వం విడుదల చేస్తోంది. ఖమ్మం నగర పాలకసంస్థకు 15వ ఆర్థిక సంఘం ద్వారా రూ.12కోట్ల నుంచి రూ.13 కోట్ల వరకు మంజూరయ్యే అవకాశముంది. కానీ రెండు విడతల్లోనూ రూపాయి రాలేదు. 2023–24లో వరుస ఎన్నికలు, ఇతర పనులు ఉన్నా.. నాటి కమిషనర్ చొరవతో రూ.30.63 కోట్లు ఆస్తిపన్ను రూపంలో వసూలు చేశారు. అయినప్పటికీ ఫలితం దక్కకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఉన్నతాధికారుల దృష్టికి సమస్య..

రాష్ట్రంలోని ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు సుమారు మరో 60–70 మున్సిపాలిటీలకు ఆర్థిక సంఘం నిధులు విడుదల కాలేదని సమాచారం. ఇందులో కేఎంసీ నిబంధనల ప్రకారం పన్నుల వసూళ్లలో ప్రగతిని సాధించినా నిధులు విడుదల కాని అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య తీసుకెళ్లినట్లు తెలిసింది. ఆన్‌లైన్‌లో చిన్నచిన్న తప్పిదాల కారణంగా ఇలా జరిగినందున నిధులు మంజూరయ్యేలా చూడాలని వివరాలు సమర్పించినట్లు సమాచారం. కమిషనర్ చొరవ ఫలించి నిధులు మంజూరైతే అభివృద్ధి పనుల నిర్వహణ, బిల్లుల చెల్లింపునకు ఇక్కట్లు తొలగిపోతాయి.

ఖమ్మం ఇందిరానగర్ ప్రదర్శశాలలో కోలాటం ఆడుతున్న మహిళలు




బతుకమ్మతో వస్తున్న మహిళ

ఆడబిడ్డల సంబురం

ఊరూవాడా బతుకమ్మ సంబురం మొదలైంది. తొమ్మిది రోజుల పాటు కొనసాగే వేడుకలు ఎంగిలిపూల బతుకమ్మతో ఆదివారం మొదలయ్యాయి. తీరొక్క పూలతో బతుకమ్మలు పేర్చిన మహిళలు చిన్నాపెద్ద తేడా లేకుండా సాయంత్రం సమీపంలోని ఆలయాలు, మైదానాలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా సంప్రదాయ దుస్తులు ధరించిన మహిళలు బతుకమ్మలను ఒకచోటకు చేర్చి కోలాటం ఆడడమే కాక పూజలు చేశారు. అనంతరం వాయినాలు ఇచ్చిపుచ్చుకుని ఇళ్లకు బయలుదేరారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్


వాయినం ఇచ్చిపుచ్చుకుంటున్న మహిళలు


బతుకమ్మలకు పూజ చేస్తూ...

‘హరిత’భాగ్యం లేదా..?!

- రెండేళ్ల క్రితమే శంకుస్థాపన.. స్థలం సరిపోదని వాయిదా
- ప్రత్యామ్నాయం ఎంపికలో ఎడతెగని జాప్యం

Haritha Hotels & Resorts

ఖమ్మం రాపర్తినగర్: జిల్లా కేంద్రంలో పర్యాటక శాఖ ఆధ్వర్యాన హరిత హోటల్ నిర్మాణానికి ముందడుగు పడడం లేదు. రెండేళ్ల క్రితం రూ.5కోట్ల వ్యయంతో హోటల్ నిర్మించేలా కొత్త బస్టాండ్ సమీపాన స్థలాన్ని సేకరించారు. కానీ ఆ స్థలం అనువుగా లేదని పర్యాటక శాఖ తేల్చిచెప్పడంతో ప్రత్యామ్నాయ స్థలాల కోసం అన్వేషిస్తున్నా ఓ కొలిక్కి రావడం లేదు. ఫలితంగా ప్రభుత్వ పరంగా హోటల్ లేక జిల్లాకు వచ్చే ఇతర ప్రాంతాల వారు, పర్యాటకులు ప్రైవేట్ హోటళ్లను ఆశ్రయించాల్సి వస్తోంది.

రెండెకరాలకు పైగా...

కొత్త బస్టాండ్ వద్ద హరిత హోటల్ నిర్మాణానికి గతంలో స్థలాన్ని గుర్తించారు. రెండేళ్ల క్రితం అప్పటి మంత్రి కేటీఆర్ కొత్త బస్టాండ్ సమీపాన శంకుస్థాపన కూడా చేశారు. కానీ ఆ స్థలం 20 గుంటలే కావడంతో భవన నిర్మాణానికి సరిపోయినా పార్కింగ్, ఇతర అవసరాలకు ఇబ్బంది అవుతుందని పర్యాటక శాఖ అధికారులు నిరాకరించారు. ఆపై జిల్లా కేంద్రంలో రెండు నుంచి మూడెకరాల స్థలం కోసం ఆరాతీసినా ఫలితం కానరాలేదు. ఖానాపురం హవేలీ, రఘునాథపాలెం, వీ.వీ.పాలెం, దానవాయిగూడెం, వరంగల్ క్రాస్ రోడ్డు, జలగంనగర్ ప్రాంతాల్లో ఖాళీస్థలాలు ఉన్నప్పటికీ నగరానికి దూరమవుతుందని వెనుకడుగు వేస్తున్నట్లు తెలిసింది. చివరకు ఖాళీగా ఉన్న ఎన్నెస్పీ స్థలాలను ఎంపిక చేయాలనే భావనకు వచ్చి నట్లు తెలిసింది. ఈమేరకు జిల్లా కేంద్రంలోనే హోటల్ నిర్మాణానికి స్థలం గుర్తించాలని రాష్ట్ర పర్యాటకశాఖ అధికారులు సూచించినట్లు సమాచారం. అయితే, ఈ ప్రయత్నాల్లో జాప్యం జరుగుతుండడంతో హోటల్ ఎప్పుడు నిర్మిస్తారో తెలియరావడంలేదు. ఖాళీగా ఉన్న ఎన్నెస్పీ స్థలాలు అన్యాక్రాంతమవుతున్నందున హరిత హోటల్ నిర్మాణాని కి కేటాయిస్తే అన్ని వసతులతో నిర్మాణం చేపట్టే అవకాశం ఉంటుంది. తద్వారా జిల్లాకు వచ్చే పర్యాటకులకే కాక ఇతరులకు వసతి సౌకర్యం అందుబాటులోకి రానుంది.

న్యూస్‌రీల్

నేడు డిప్యూటీ సీఎం భట్టి పర్యటన


మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్

ముదిగొండ: ముదిగొండ మండలంలో సోమవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మండలంలోని యడవల్లి, మాదాపురం, ముదిగొండలో సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. అలాగే, పలు పార్టీల నాయకులు భట్టి సమక్షాన కాంగ్రెస్‌లో చేరనున్నారు. కాగా, వెంకటాపురంలో ఆదివారం ఏర్పాటుచేసిన సన్నాహక సమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు మాట్లాడారు. భట్టి పర్యటనను పార్టీ శ్రేణులు జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పీటీసీలు మందరపు నాగేశ్వరరావు, పసుపులేటి దేవేంద్రం, మహిళా విభాగం జిల్లా, మండల అధ్యక్షురాలు సౌజన్య, ఝాన్సీరాణి, నాయకులు కందిమళ్ల వీరబాబు, ఇసుకల రమేష్, మట్టా బాబురాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు

ఖమ్మం సహకారనగర్ : ఓపెన్ స్కూల్ సొసైటీ పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు సోమవారం నుంచి ఈనెల 28 వరకు నిర్వహించనున్నారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఒక సెషన్, మధ్యాహ్నం 2–30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు రెండో సెషన్‌గా పరీక్షలు ఉంటాయని, ఖమ్మంలో పదో తరగతి, ఇంటర్‌కు ఒక్కో కేంద్రం చొప్పున ఏర్పాటు చేశామని అధికారులు వెల్లడించారు. ఖమ్మం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల కేంద్రంలో పదో తరగతి విద్యార్థులు 287 మంది, ప్రభుత్వ ఉన్నత పాఠశాల(రిక్కా బజార్) కేంద్రంలో 254 మంది ఇంటర్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. ఒక్కో కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్ట్‌మెంటల్ అధికారిని నియమించామని, ప్రతీ సెంటర్‌కు సిట్టింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేశామని, తాగునీరు, మెడికల్, విద్యుత్ తదితర సౌకర్యాలు కల్పించామని వివరించారు. విద్యార్థులకు ఏమైనా సందేహాలు ఉంటే ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ కె.మంగపతిరావు(80084 03522)ను సంప్రదించాలని సూచించారు. కాగా పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి ఘటనలు జరగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు జెడ్పీ సీఈఓ, ఇన్‌చార్జ్ డీఈఓ దీక్షారైనా తెలిపారు.

సెలవులకు ఊరెళ్తున్నారా?!

- కొద్ది జాగ్రత్తలతో మీ సొత్తు భద్రం
- సూచనలు జారీ చేసిన పోలీసుశాఖ


సునీల్‌దత్, పోలీస్ కమిషనర్

ఖమ్మంక్రైం: విద్యాసంస్థలకు దసరా సెలవులు మొదలయ్యాయి. ఇంకోపక్క బతుకమ్మ సందడి ప్రారంభమైంది. దీంతో పిల్లలతో సహా కుటుంబాలు స్వగ్రామాలు లేదా విహారయాత్రలు, పుణ్యక్షేత్రాల సందర్శనకు బయలుదేరనున్నాయి. ఇదే అదునుగా దొంగలు తమ చేతులకు పదును పెట్టే అవకాశముంది. ఈ నేపథ్యాన కష్టపడి సంపాదించిన నగదు, ఆభరణాలు దొంగల పాలుకాకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ సూచించారు. పోలీసుశాఖ పరంగా చోరీల నియంత్రణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాత్రి వేళ గస్తీ ముమ్మరం చేశామని వెల్లడించిన ఆయన ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

సీపీ జారీ చేసిన సూచనలు

- పేపర్లు, ఖాళీ సంచులు ఏరుకోవడం, ఇతర సామగ్రి అమ్మకం పేరిట వచ్చే వారి విషయంలో అప్రమత్తంగా ఉంటూ ఎవరైనా అనుమానంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. తాళం వేసి ఉన్న ఇళ్ల వద్దకు ఒకటి, రెండు సార్లు ఎవరైనా వచ్చి వెళ్లినా అప్రమత్తం కావాలి.
- ఇళ్లలో వృద్ధులు ఉంటే అపరిచితులకు ఎలాంటి సమాచారం ఇవ్వొద్దని సూచించాలి. తరచుగా పరిశీలించాలని ఇరుగుపొరుగు వారికి తెలపాలి. వీరి ద్వారా తరచూ సమాచారం తెలుసుకోవాలి.
- ఇతర చోట్లకు వెళ్లేటప్పుడు ఖరీదైన వస్తువులను ఇంట్లో పెట్టొద్దు. బ్యాంక్ లాకర్లలో పెట్టడం ద్వారా భద్రత ఉంటుంది. ఇంటికి తాళం వేసి చాలారోజులు వెళ్లాల్సి వస్తే సమీప పోలీసుస్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి. తద్వారా సిబ్బంది గస్తీకి వచ్చినప్పుడు పరిశీలించే అవకాశం ఉంటుంది.
- కాలనీలు, అపార్ట్‌మెంట్లు, ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు శ్రేయస్కరం. తద్వారా ఎక్కడ ఉన్నా సెల్‌ఫోన్‌లోనే తమ ఇంటి చుట్టూ జరుగుతున్న అంశాలను తెలుసుకోవచ్చు. అలాగే, అపార్ట్‌మెంట్లకు 24గంటల పాటు ఉండేలా వాచ్‌మెన్లను తప్పనిసరి నియమించుకోవాలి. అంతేకాక సమీప పోలీసుస్టేషన్‌తో పాటు పెట్రోలింగ్ సిబ్బంది ఫోన్ నంబర్లు తీసుకుంటే అనుమానితులు కనిపించినప్పుడు సమాచారం ఇవ్వడం వీలవుతుంది.
- బీరువా తాళాలు ఇంట్లో పెట్టకుండా వెంట తీసుకెళ్లాలి. ఇంటి తాళం కానరాకుండా చూస్కోవాలి. అలాగే, ఇంటి ప్రధాన ద్వారానికి సెంట్రల్ లాకింగ్ సిస్టం అమర్చుకోవడం సురక్షితం.

రామయ్యకు సువర్ణ పుష్పార్చన


స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచల శ్రీ సీతారామ చంద్రస్వామి వారి దేవస్థానంలోని మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరి పారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాతసేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.

స్యాండ్ బజార్ల ద్వారా ఇసుక సరఫరా

- ఐదు ప్రాంతాల్లో ఇప్పటికే ఏర్పాటు
- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి


ఖమ్మం సహకారనగర్: జిల్లాలో ఇందిరమ్మ గృహ నిర్మాణాలతో పాటు ప్రభుత్వ పథకాల పనులకు తగినంత ఇసుక పారదర్శకంగా సరఫరా చేస్తున్నామని కలెక్టర్ అనుదీప్ తెలిపారు. ఇందుకోసం రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన కూసుమంచి, మధిర, కామేపల్లి, సత్తుపల్లి, ఖమ్మంలో స్యాండ్ బజార్లు ఏర్పాటుచేశామని వెల్లడించారు. వీటి ద్వారా ఇప్పటివరకు 634 మెట్రిక్ టన్నులు సరఫరా చేసినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు రూ.1,100కే మెట్రిక్ టన్ను ఇసుక అందిస్తున్నామని చెప్పారు. కూసుమంచి స్యాండ్ బజార్ ద్వారా 634 మెట్రిక్ టన్నుల ఇసుక సరఫరా చేయగా 424 మెట్రిక్ టన్నులు నిల్వ ఉందని తెలిపారు. అలాగే, మధిరలో 1,164 మెట్రిక్ టన్నులు, కామేపల్లిలో 832, ఖమ్మంలో 1,500 మెట్రిక్ టన్నులు, సత్తుపల్లి స్యాండ్ బజార్‌లో 640 టన్నుల ఇసుక నిల్వ ఉందని కలెక్టర్ వెల్లడించారు. అంతేకాక ఇసుక రీచ్‌లను మహిళా సంఘాలకు కేటాయించి కూపన్ల ఆధారంగా ఇందిరమ్మ ఇళ్లకు సరఫరా చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు.

32,494 మె. టన్నుల యూరియా పంపిణీ

వానాకాలం పంటల సాగు చేసే రైతులకు అవసరమైన యూరియా సకాలంలో అందేలా చర్యలు చేపట్టామని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు అవసరమైన 45,678 మెట్రిక్ టన్నుల్లో 41వేల మెట్రిక్ టన్నులు చేరగా, 32,494 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు పంపిణీ చేశామని పేర్కొన్నారు. జిల్లాలోని 76 పీఏసీఎస్‌లు, 26 ఆగ్రో రైతు సేవాకేంద్రాల ద్వారా పంపిణీ జరుగుతుండగా.. 66 కొత్త కేంద్రాలు కూడా తెలిపారు. రైతులెవరూ వేచి ఉండకుండా కూపన్ల ఆధారంగా యూరియా పంపిణీ చేస్తూ, కేంద్రాల వద్ద తాగునీరు, టెంట్లు, కుర్చీలు ఏర్పాటు చేశామని వెల్లడించారు. జిల్లాలోని ప్రతీ రైతుకు సరైన సమయాన యూరియా అందేలా పర్యవేక్షణ కొనసాగుతోందని తెలిపారు. ఇదేసమయాన ఎవరైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అనుదీప్ హెచ్చరించారు.

పాఠశాలలకు రేటింగ్ !

- నిర్ణీత ప్రమాణాల ఆధారంగా కేటాయింపు
- జిల్లాలో ఇప్పటికే వేయి స్కూళ్ల రిజిస్ట్రేషన్
- జాతీయ స్థాయిలో ఎంపికైతే రూ.లక్ష ప్రోత్సాహక నగదు



ఖమ్మం సహకారనగర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగానికి ప్రాధాన్యత ఇస్తూనే ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయిస్తున్నాయి. ఇదే సమయాన నిర్వహణ మరింత మెరుగుపడేలా పాఠశాలల నడుమ పోటీతత్వం పెంచేందుకు వివిధ కార్యక్రమాలు చేస్తున్నాయి. ఇందులో భాగంగానే పరిశుభ్రమైన వాతావరణం, ఆహ్లాదం, మౌలిక వసతుల కల్పనలో ముందు నిలిచే పాఠశాలలకు నగదు పురస్కారాలు అందించేందుకు ‘స్వచ్ఛ ఏవం హరిత్ విద్యాలయ’ పథకాన్ని కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టింది. నిర్ణీత ప్రమాణాల ఆధారంగా మార్కులు కేటాయించి.. ఆపై రేటింగ్ ఇస్తారు. తద్వారా కేంద్రప్రభుత్వం నుంచి నగదు ప్రోత్సాహకం అందనుంది.

30లోగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్

జిల్లాలోని 21 మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు 1,601 ఉన్నాయి. ఇందులో ప్రాథమిక పాఠశాలలు 866, ప్రాథమికోన్నత పాఠశాలలు 277, హైస్కూళ్లు 458 కొనసాగుతున్నాయి. ఈ స్కూళ్లన్నీ స్వచ్ఛ ఏవం హరిత్ విద్యాలయ రేటింగ్ కోసం పోటీ పడే అవకాశముంది. ఇందుకోసం పాఠశాలల ప్రధానోపాధ్యాయులు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఈ నెల 30వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆపై మొత్తం 60ప్రశ్నలకు గాను 125పాయింట్లు సాధిస్తే 5 స్టార్ రేటింగ్ దక్కుతుంది. ఇప్పటివరకు జిల్లాలో వేయి వరకు పాఠశాలల రిజిస్ట్రేషన్ పూర్తయిందని అధికారులు తెలిపారు.


మూడు దశల్లో పరిశీలన

జిల్లా స్థాయిలో ప్రధానోపాధ్యాయులు పొందుపరిచిన సమాచారాన్ని కలెక్టర్, డీఈఓ, డీఎంహెచ్‌ఓ, ఇంజనీరింగ్ అధికారితో పాటు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, ముగ్గురు ఉపాధ్యాయులతో కూడిన కమిటీ పరిశీలిస్తుంది. ఆతర్వాత మెరుగైన వసతులు ఉన్న స్కూళ్లకు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. మూడు లేదంటే అంత కంటే ఎక్కువ స్టార్ రేటింగ్ ఉన్న ఆరు గ్రామీణ ప్రాంతాలలు, రెండు పట్టణ ప్రాంతాల్లోని పాఠశాలలను ఎంపిక చేయనున్నారు. ఆయా పాఠశాలలను రాష్ట్ర విద్యాశాఖ, వైద్య, ఆరోగ్యశాఖ, పంచాయితీరాజ్ శాఖ, స్థానిక సంస్థల సంచాలకులతో పాటు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, ఇద్దరు హైస్కూళ్ల హెచ్‌ఎంలతో కూడిన కమిటీ పరిశీలించి.. నాలుగు స్టార్ రేటింగ్‌పైన దక్కించుకున్న 14గ్రామీణ హైస్కూళ్లు, ఆరు పట్టణ ప్రాంతాల్లోని పాఠశాలలను ఎంపిక చేసి జాతీయ స్థాయికి ప్రతిపాదిస్తారు. వీటిని మరోమారు పరిశీలించి ఐదు స్టార్ రేటింగ్ కలిగిన 140 గ్రామీణ పాఠశాలలు, 60 పట్టణ ప్రాంతాల పాఠశాలలను జాతీయ స్థాయిలో ఉత్తమమైనవిగా ఎంపిక చేస్తారు. ఇలా ఎంపికైన 200 పాఠశాలలకు రూ.లక్ష చొప్పున ప్రోత్సాహక నగదు బహుమతి అందుతుంది.

లక్ష్యం.. పాయింట్లు

ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రత, పచ్చదనం, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాన్ని మెరుగుపర్చడమే కాక పిల్లల్లో స్నేహపూరిత వాతావరణం పెంపొందించడం, విద్యార్థులకు వ్యక్తిగత, పాఠశాల పరిశుభ్రతపై అవగాహన పెంచడమే లక్ష్యంగా ‘స్వచ్ఛ ఏవం హరిత్ విద్యాలయ’ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఇందులో తాగునీటి వినియోగానికి 22పాయింట్లు, మరుగుదొడ్ల నిర్వహణకు 27, సబ్బుతో చేతులు కడుక్కునే సౌకర్యం ఉంటే 14, ప్రవర్తన, మార్పునకు 20పాయింట్లు కేటాయిస్తారు. అలాగే, పచ్చదనం, పరిశుభ్రతకు 21 పాయింట్లు, పర్యావరణ క్లబ్‌ల ఏర్పాట్లు, ఎల్ఈడీల బల్బుల వినియోగం, మొక్కల సంరక్షణ, ప్లాస్టిక్ నివారణ తదితర అంశాలకు 21 కలిపి మొత్తం 125 పాయింట్లు ఉంటాయి. విభాగాల వారీగా ఫొటోలతో సహా వివరాలు పొందుపరిస్తే పాయింట్ల ఆధారంగా పాఠశాలలకు ఒకటి నుంచి ఐదు వరకు స్టార్ రేటింగ్ కేటాస్తారు.


హెచ్‌ఎంలకు శిక్షణ పూర్తి



స్వచ్ఛ ఏవం హరిత్ విద్యాలయ రేటింగ్‌కు వివరాల నమోదుపై హెచ్‌ఎంలకు శిక్షణ ఇచ్చాం. జాతీయ స్థాయిలో 200 పాఠశాలలను ఎంపిక చేయనుండగా రూ.లక్ష నగదు బహుమతి అందుతుంది. ఆ నిధులు పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు ఉపయోగపడతాయి. అందుకే జిల్లా నుంచి ఎక్కువ సంఖ్యలో స్కూళ్ల పోటీ పడేలా చూస్తున్నాం.

– బాబోజు ప్రవీణ్‌కుమార్, కమ్యూనిటీ మొబిలైజింగ్ ఆఫీసర్

97 మందికి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.41 లక్షలు


సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి సిఫార్సుతో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) చెక్కులను ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో నాయకులు పంపిణీ చేశారు. ఉమ్మడి జిల్లాలోని 97 మందికి రూ.41 లక్షల సాయం మంజూరు కాగా, పీసీసీ ప్రధాన కార్యదర్శి మద్దినేని స్వర్ణకుమారి, నాయకులు తుంబూరు దయాకర్‌రెడ్డి, కొప్పుల చంద్రశేఖర్ లబ్ధిదారులకు అందజేసి మాట్లాడారు. వివిధ మండలాల నాయ కులు బాలాజీనాయక్, స్వర్ణ నరేందర్, వడ్డెబోయిన నరసింహారావు, ఉమ్మినేని కృష్ణ, ఉప్పునూతల నాగేశ్వరరావు, ఒంటికొమ్ము శ్రీనివాసరెడ్డి, అర్వపల్లి శివ, బోడా శ్రావణ్, కాంపాటి వెంకన్న, గౌస్, విప్లవ్‌కుమార్, గురుమూర్తి, వేణు, రంజిత్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం


చెక్‌పోస్టు వద్ద సీజ్ చేసిన ట్రాక్టర్లతో పోలీసులు

సాక్షి ఎఫెక్ట్..

ముదిగొండ: ముదిగొండ, చింతకాని మండలాల్లో మున్నేటి నుంచి ఇసుక అక్రమ తరలింపు జరుగుతున్న అంశంపై 'సాక్షి'లో వరుస కథనాలతో పోలీసు అధికారులు స్పందించారు. ఇప్పటికే ఇసుక రీచ్‌ల వద్ద, జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యాన ముదిగొండ సీఐ ఓ.మురళి ఆధ్వర్యాన ఆదివారం ముదిగొండ మండలం మల్లారం చెక్ పోస్టు తనిఖీ చేయగా అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను సీజ్ చేశారు. ఏపీలోని వత్సవాయి మండలం, మల్కాపురం నుంచి ముదిగొండ మండలానికి ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించి కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

పెండింగ్ బిల్లులు సత్వరమే చెల్లించాలి


మాట్లాడుతున్న పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు

ఖమ్మం సహకారనగర్: ఉపాధ్యాయులతో పాటు రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బిల్లులన్నీ తక్షణమే చెల్లించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కట్టా శేఖర్‌రావు డిమాండ్ చేశారు. ఖమ్మంలోని యూనియన్ కార్యాలయంలో ఆదివారం జరిగిన జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడాది కాలంగా ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులకు రిటైర్మెంట్ బెనిఫిట్లు అందకపోగా, జీపీఎఫ్, టీఎస్ జీఎల్ఐ, మెడికల్ బిల్లులు కూడా పెండింగ్ పెట్టారని తెలిపారు. ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా నెలకు రూ.700 కోట్లు విడుదల చేస్తామన్న హామీ కూడా నెరవేరడం లేదని తెలిపారు. ఇకనైనా పెండింగ్ బిల్లులు విడుదల చేయడమే కాక సీపీఎస్‌ను రద్దు చేయాలని, మెరుగైన ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ ప్రకటించాలంటూ తీర్మానించారు. యూనియన్ నాయకులు మోత్కూరి మధు, వెంకటనరసయ్య, యలమంచి వెంకటేశ్వర్లు, ఆర్.రంగారావు, చిత్తలూరి ప్రసాదరావు, బ్రహ్మారెడ్డి, విజయ, అమృత్‌కుమార్, జయమ్మ, కొమ్ము శ్రీనివాసరావు, పుట్లూరు వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రిలో బాలిక ప్రసవం

నర్సు ద్వారా శిశువు విక్రయానికి యత్నం?

ఖమ్మంవైద్యవిభాగం/ఖమ్మం క్రైం: ఓ మైనర్ బాలిక ప్రసవించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని ఓ తండాకు చెందిన సదరు బాలిక గర్భం దాల్చగా, నెలలు నిండడంతో కుటుంబీకులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో శనివారం చేర్పించినట్లు సమాచారం. అక్కడ బాలిక ఆడశిశువుకు జన్మనివ్వగా, పాపను తీసుకెళ్లేందుకు వారు నిరాకరించారని తెలిసింది. దీంతో శిశువును అమ్మేందుకు ఆస్పత్రి నర్సు ద్వారా బేరసారాలు సాగించినట్లు సమాచారం. ఈవిషయం బయటకు పొక్కడంతో ఐసీడీఎస్, వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో పాటు పోలీసులు విచారణ చేపట్టారు. శిశువును స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తే, చివరకు బాలిక బంధువులే తీసుకెళ్తామని చెప్పినట్లు సమాచారం. కాగా, బాలిక గర్భానికి అదే తండాకు చెందిన యువకుడు కారణమని గుర్తించి ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశాక, మరిపెడ పోలీసుస్టేషన్‌కు బదలాయించారు. అయితే, శిశువు అమ్మకం విషయమై పై వివరణ కోరేందుకు బాలల సంరక్షణ అధికారులకు ఫోన్ చేసినా స్పందించలేదు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్‌కు గాయాలు

సత్తుపల్లిరూరల్: ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సరఫరా నిలిపివేసేందుకు ప్రయత్నించిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌కు విద్యుదాఘాతంతో గాయాలయ్యాయి. సత్తుపల్లి మండలం కాకర్లపల్లికి చెందిన ధర్మసోత్ రామకృష్ణ ప్రైవేట్ ఎలక్ట్రీషన్‌గా పని చేస్తున్నాడు. గ్రామంలోని ఓ రైతు పొలంలో మోటారు ఫ్యూజ్ పోయిందని చెప్పగా, ఆదివారం మరో వ్యక్తితో కలిసి ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర సరఫరా నిలిపేందుకు ప్రయత్నించాడు. ఆ సమయాన రామకృష్ణ మెడలో ఉన్న గొలుసు 33/11 కేవీ వైర్‌కు తాకగాషాక్‌తో ఆయన మెడ భాగం కాలిపోయింది. దీంతో 108 సిబ్బంది గొల్లమందల కృష్ణ, కట్టం మహేష్ చేరుకుని ప్రాథమిక చికిత్స చికిత్స అనంతరం సత్తుపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై విద్యుత్ శాఖ, పోలీసు అధికారులు విచారణ చేపట్టారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.19,107

కలుపు మందుల్లోనూ కల్తీ ?

- వరి పైర్లపై పనిచేయక పెరుగుతున్న తుంగ గడ్డి
- వేలాది ఎకరాల్లో పైర్లపై ప్రభావం
- దిగుబడి తగ్గుతుందని అన్నదాతల ఆందోళన


బిల్లుపాడులో వరి కంటే అధికంగా పెరిగిన తుంగ గడ్డి (ఇన్‌సెట్) పొలంలో పెరిగిన తుంగదుబ్బులతో రైతులు

తల్లాడ: అటు మద్దతు ధర, ఇటు ప్రభుత్వ బోనస్ వస్తుందనే ఆశతో ఆరుగాలం కష్టపడి వరి సాగు చేస్తున్న రైతులను కలుపు వేధిస్తోంది. దీంతో అన్నదాతలు అప్రమత్తమై ఒకటికి నాలుగు సార్లు గడ్డి మందు పిచికారీ చేసినా తుంగగడ్డి, తదితర కలుపు ఆగకుండానే పెరుగుతుండడంతో దిగుబడిపై ప్రభావం పడుతుందని ఆందోళన చెందుతున్నారు. ఇందుకు కల్తీ కలుపు నివారణ మందే కారణమనే ఆరోపణలు వస్తున్నాయి. తల్లాడ మండలంలోని వేలాది ఎకరాల్లో ఈ సమస్య ఉండగా అధికారులు స్పందించాలని రైతులు కోరుతున్నారు.

వెదజల్లిన పొలాల్లోనే తీవ్రత

తల్లాడ మండలంలో ఈ ఏడాది 10వేల ఎకరాల్లో వెదజల్లే పద్ధతిలో రైతులు వరి సాగు చేశారు. గత జూలైలో సాంబమసూర బీపీటీ 5204 వరి రకం సాగు మొదలుపెట్టగా, 21 రోజుల తర్వాత కలుపు నివారణ మందు స్ప్రే చేసినా గడ్డి తగ్గలేదు. మళ్లీ 35 రోజుల వయస్సులో, ఆపై ఇంకో నెలకు ఇలా విడతల వారీగా ఎకరాలకు రూ.1,500 చొప్పున రూ.6 వేలు వెచ్చించి నాలుగు సార్లు గడ్డి మందు కొట్టినా ఫలితం లేక దిక్కు తోచని స్థితి ఎదుర్కొంటున్నారు. వెదజల్లే పద్ధతిలో సాగు చేసే వరి పొలాల్లో కూలీలతో కలుపు తీయడం సాధ్యం కాదు. మందు మాత్రమే కొట్టే అవకాశముండడంతో ఆ పనిచేసినా తుంగ గడ్డి చావక 50 శాతం దిగుబడి తగ్గుతుందని వాపోతున్నారు. తల్లాడ మండలంలోని అన్నారుగూడెం, గోపాలపేట, బిల్లుపాడు, కొత్త వెంకటగిరి, నరసింహారావుపేట, రామచంద్రాపురం తదితర గ్రామాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉండగా.. రైతులు ఆదివారం పొలాల్లో గడ్డి చూపిస్తూ నిరసన తెలిపారు. నకిలీ మందులే తమ సమస్యకు కారణమైనందున బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నాలుగు సార్లు మందు కొట్టినా...



పంటపై 22రోజులకోసారి, మళ్లీ 15 రోజుల తర్వాత ఇలా రెండు నెలల్లో నాలుగు సార్లు గడ్డి మందు మార్చిమార్చి కొట్టినా పని చేయలేదు. ప్రస్తుతం వరి పైరులో తుంగ గడ్డి బాగా పెరిగింది. ఈ సమస్య కారణంగా దిగుబడిపై ప్రభావం పడుతుంది.
– ఆపతి వెంకటరామారావు, రైతు, అన్నారుగూడెం

వెదజల్లే పద్ధతిలో సాగు చేశా..



ఏడెకరాల్లో సాంబమసూర వరి రకం వెదజల్లే పద్ధతిలో సాగు చేశా. పొలంలో తుంగ గడ్డిపై ఎన్ని మందులు కొట్టినా పని చేయటంలేదు. గతంలో ఓసారి పిచికారీ చేస్తే కలుపు పోయేది. ఇప్పుడు ఎకరాకు రూ.6వేల మందు వాడినా ఫలితం లేదు.
– ఇనుపనూరి కొండయ్య, రైతు, వెంకటగిరి

ఏ మాత్రం ఫలితం లేదు



కలుపు నివారణకు స్థానిక షాప్‌లో గడ్డి మందు తెచ్చి పిచికారీ చేసినా గడ్డి చావ లేదు. అంతేకాక రోజురోజుకు గడ్డి పెరుగుతోంది. ఈ కారణంగా వరి పైరు ఎదగడం లేదు. దీంతో దిగుబడి తగ్గనున్నందున అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలి.
– నున్నా వెంకటేశ్వర్లు, రైతు, అన్నారుగూడెం

మరక మంచిదే..!

- ఏసీబీకి దొరికినా కఠిన చర్యలు కరువు
- బదిలీ లేదా పాత స్థానంలోనే పోస్టింగ్
- ఫలితంగా రెవెన్యూ శాఖలో యథావిధిగా దందా


తల్లాడలో ఇటీవల ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్న నగదు

సత్తుపల్లి: ఏసీబీ అధికారులకు పట్టుబడడం.. ఆపై కొన్నాళ్లకు మరోచోట పోస్టింగ్ వస్తుండడంతో రెవెన్యూ శాఖలోని కొందరు ఉద్యోగులకు 'మరక మంచిదే' అన్న చందంలా మారింది. అవినీతి ఉద్యోగులపై కఠిన చర్యలేమి లేకపవడంతో ఎక్కడ పోస్టింగ్ ఇచ్చినా యథాతథంగా దందా సాగించడం రివాజులా కొనసాగిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. 2019 మార్చిలో గంగారం వీఆర్వోగా పనిచేసిన పద్ద వెంగళరావు రైతు దాసరి మాధవరెడ్డి నుంచి రూ.18వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు. ఆ వెంటనే ఆయనపై సస్పెన్షన్ వేటు పడింది. కానీ వెంగళరావు అయ్యగారిపేట జీపీఓగా సత్తుపల్లి తహసీల్‌లోనే ఇటీవల మళ్లీ చేరడం గమనార్హం. ఇలా రెవెన్యూశాఖలో అవినీతి కేసుల్లో ఏసీబీకి పట్టుబడిన వారిలో ఎక్కువ మంది పాత స్థానాల్లో పోస్టింగ్ తెచ్చుకుంటుండడంతో గతంలో ఫిర్యాదు చేసిన వారు ఆందోళన చెందుతున్నారు.

మాకేంటి భయం?

రెవెన్యూశాఖలో కొందరు ఉద్యోగుల పనితీరు ఉన్నతాధికారులకు తలనొప్పి తీసుకొస్తుందనే ఆరోపణలున్నాయి. సత్తుపల్లి నియోజకవర్గంలో ఒకరిద్దరు ఆర్ఐలు ఎలాంటి భయం లేకుండా ఫోన్‌పే ద్వారా డబ్బు తీసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ అంశంపై అధికార పార్టీలోని ఓ ముఖ్యనేత సదరు ఆర్ఐలను పిలిచి పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించినట్లు సమాచారం. అయినా వారిలో మార్పు రాకపోగా మరింత విచ్చలవిడిగా డబ్బులు లాగుతున్నట్లు తెలుస్తోంది.

అంతా ఆపరేటర్ల చేతుల్లోనే..

భూమి రిజిస్ట్రేషన్లుకు వచ్చే రైతుల నుంచి నేరుగా అధికారులు డబ్బు తీసుకోవడం లేదని సమాచారం. కంప్యూటర్ ఆపరేటర్లను మధ్యవర్తులుగా నియమించుకుని వారితోనే బేరసారాలు సాగించడంతో పాటు డబ్బు వసూళ్లు కూడా వారి చేతుల మీదుగానే నడిపిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ఏసీబీ దాడి జరిగినా నేరుగా పట్టుబడే అవకాశం లేకపోవడంతో అధికారులు ఈ మార్గం ఎంచుకున్నట్లు సమాచారం. దీన్ని అదునుగా తీసుకుని కొన్ని తహసీల్దార్ కార్యాలయాల్లోని ఆపరేటర్లు అధికారులు చేయలేని పనులను సైతం అవలీలగా చేస్తూ అందిన కాడికి దండుకుంటున్నట్లు తెలిసింది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలైన వీరి ఆగడాలపై ఫిర్యాదులు వస్తున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడం కారణాలు అంతుపట్టక జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బదిలీలతోనే సరి

అధికారులు, ఉద్యోగులపై అవినీతి ఆరోపణలు వచ్చినా, ఏసీబీకి పట్టుబడినా బదిలీతోనే సరిపెడుతుండడంతో వారిలో భయం ఉండడం లేదనే ప్రచారం జరుగుతోంది. ఇంకొందరికైతే అదే మండలంలో పోస్టింగ్ దక్కుతుండడంతో మళ్లీ దందా మొదలుపెట్టేస్తున్నారని సమాచారం. ఇటీవల జరిగిన ఆర్ఐల బదిలీ వ్యవహారం ఇందుకు నిదర్శనంగా నిలవగా... కంప్యూటర్ ఆపరేటర్లను బదిలీ చేసినా వారి వ్యవహార శైలిలో మార్పు రావటం లేదనే విమర్శలున్నాయి.

ఆలోచింపజేసిన 'ఆచమనం'


నాటికలోని ఓ సన్నివేశం

ఖమ్మంగాంధీచౌక్: నెలనెలా వెన్నెల కార్యక్రమంలో భాగంగా ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో ఆదివారం 98వ నాటక ప్రదర్శన జరిగింది. కాకినాడ ఎస్వీ రంగారావు కళా స్రవంతి కళాబృందం ఆధ్వర్యాన పి.వెంకన్నబాబు రచించి, డి.వినయ్ దర్శకత్వం వహించిన 'ఆచమనం' నాటికను ప్రదర్శించారు. సమాజంలో ఆత్మహత్యలకు ప్రేరేపిస్తున్న అంశాలు, ఆత్మహత్యకు యత్నించే వారికి కనువిప్పు కలిగించేలా ఉన్న ఈ నాటిక ఆలోచింపజేసింది. ఆతర్వాత రాయల్ డ్యాన్స్ అకాడమీ కళాకారుల నృత్య ప్రదర్శనతో పాటు కూచిపూడి నృత్యాలు ప్రదర్శించారు. నెలనెలా వెన్నెల నిర్వాహకులు కె.దేవేంద్ర అధ్యక్షతన జరిగిన సమావేశంలో వివిధ పార్టీల నాయకులు పోతినేని సుదర్శన్, కూరపాటి వెంకటేశ్వర్లు, కాటంనేని రమేష్, వీరభద్రరావు, నెలనెలా వెన్నెల కార్యదర్శి ఏ.ఎస్.కుమార్ ప్రజానాట్యమండలి అధ్యక్షులు నామ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉరుములు, మెరుపులతో భారీ వర్షం


తిరుమలాయపాలెంలో కమ్ముకున్న మేఘాలు

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెంలో ఆదివారం రోజంతా ఎండ, ఉక్కపోతతో ఉన్న వాతావరణం సాయంత్రానికి మారిపోయింది. ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. సాయంత్రం 5–30గంటల నుంచి గంట పాటు వర్షం కొనసాగింది. మండలంలోని రమణాతండా, ఎదుళ్లచెరువు, పిండిప్రోలు, తిరుమలాయపాలెం, కొక్కిరేణి, ఎర్రగడ్డ తదితర ప్రాంతాల్లో వర్షప్రభావం ఉండగా, గాలిదుమారం, ఉరుముల శబ్దంతో జనం ఆందోళన చెందారు.

ఖమ్మం.. కథలకు కాణాచి


సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

ఖమ్మంగాంధీచౌక్: తెలంగాణ తెలుగు ప్రత్యేకం కాగా.. అందులో ఖమ్మం కథలకు కాణాచిగా నిలుస్తోందని తెలంగాణ సాహిత్య చరిత్ర పరిశోధకులు, విమర్శకులు డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. 'ఖమ్మం స్ఫూర్తి– కథా తెలంగాణ సంస్థ' ఆధ్వర్యాన ఖమ్మంలో ఆదివారం జరిగిన 'కందిలి తెలంగాణ కథల సంకలనం' ఆవిష్కరణలో ఆయన మాట్లాడారు. ఈ సంకలనంలో ఆదివాసీల జీవితం, సామాజిక స్థితిగతులు తదితర అంశాలపై 11మంది రాసిన కథలు విభిన్నమైన అంశాలతో ఉన్నాయని తెలిపారు. అంతేకాక కవి, కథకులు వంశీకృష్ణ రాసిన విశ్లేషణ దారీ, దీపంగా నిలుస్తుందని చెప్పారు. సాహిత్య, సామాజిక విశ్లేషకులు వేణుగోపాల్, పెద్దింటి అశోక్‌కుమార్ మాట్లాడగా కేంద్ర సాహిత్య అకాడమీ సలహా మండలి సభ్యుడు ప్రసేన్, ధరణికోట రమేష్‌కుమార్, సీతారాం, రవిమారుత్, షఫీ, ఇబ్రహీం, నిర్గుణ్, జయశ్రీ, సుభాషిణి పాల్గొన్నారు.

'మహమ్మద్ ప్రవక్త జీవితమే ఒక సందేశం'


మాట్లాడుతున్న రాంపూర్ ఎంపీ మహిబుల్లా నద్వీ

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రపంచానికి మార్గదర్శకుడిగా నిలిచిన మహమ్మద్ ప్రవక్త జీవితం అందరికీ ఒక సందేశమని ఉత్తరప్రదేశ్‌లోని రాంపూర్ ఎంపీ మహిబుల్లా నద్వీ తెలిపారు. ముస్లిం ఐక్య సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ముజాహిద్ ఇషాతి అధ్యక్షతన ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. సకల మానవులకు ప్రవక్త దారి చూపారని చెప్పారు. జేఎన్‌యూ మాజీ ప్రొఫెసర్, సూఫీ సంఘం వ్యవస్థాపకులు డాక్టర్ హఫీజుర్ రెహమాన్, మాజీ ఎంపీ ఉబేద్దుల్లా ఖాన్ అజ్మీ, అబ్దుల్ వస్తా ఆన్ మాట్లాడగా, తొలుత ఖమ్మం ఎఫ్‌సీఐ గోదాంల నుంచి ఎన్నెస్పీ గెస్ట్‌హౌస్ వరకు ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించారు. ఈ సభలో షేక్ హుస్సేన్, సయీద్ అహ్మద్ ఖాస్మి, హఫీజ్ జవాద్ అహ్మద్, ఎండీ.అసద్, ఎండీ.సాధిక్ అహ్మద్, హఫీజ్ జక్కీవుల్ల, షేక్ గౌసుద్దీన్, సయ్యద్ కరీం, షేక్ బాసిత్ అలీ, షేక్ మహబూబ్ పాషా, షేక్ అబ్దుల్ రెహమాన్, సయ్యద్ రషీద్, షేక్ గాలిబ్, షేక్ మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వృద్ధుడు మృతి


వృద్ధుడి మృతదేహం

ఖమ్మంక్రైం: ఖమ్మం రైల్వే స్టేషన్ మూడో నంబర్ ప్లాట్‌ఫామ్ వైపు సైకిల్ స్టాండ్ వద్ద గుర్తుతెలియని వృద్ధుడు(75) మృతి చెందాడు. ఆయన ధరించిన చొక్కాపై ఎంఆర్ టైలర్స్, ప్రకాష్‌నగర్ అని స్టిక్కర్ ఉండగా, ఇతర ఆధారాలు లభించలేదని త్రీటౌన్ పోలీసులు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 87126 59116, 87126 59117, 87126 59115 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఇక్కడ ఇంకా ఆగలేదు..

- గుట్టలపై మట్టి తోడేస్తున్న అక్రమార్కులు
- ఎర్రుపాలెం మండలంలోని పలుచోట్ల దందా
- అయినా అధికారుల పట్టింపు లేనితనం


బంజరలో అనుమతి లేని చోట మట్టి తవ్వుతున్న పొక్లెయినర్

ఎర్రుపాలెం: జిల్లాలోని ముదిగొండ, చింతకాని తదితర మండలాల్లో ఇసుక దందా వెలుగు చూడగా కట్టడికి అధికారులు రంగంలోకి దిగారు. ఇదే సమయాన ఎర్రుపాలెం మండలంలో మాత్రం మట్టి దందా యథేచ్ఛగా సాగుతోంది. ఈ తంతు బాహాటంగానే జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. మండలంలో నాలుగు చోట్ల మాత్రమే క్వారీలకు అనుమతి ఉండగా కాచారం, నర్సింహాపురం, బంజర, బుచ్చిరెడ్డిపాలెం, భీమవరం తదితర గ్రామాల్లో అనుమతి లేకుండా పదికి పైగా చిన్నాపెద్ద క్వారీలు కొనసాగుతున్నాయని సమాచారం. ప్రభుత్వ రహదారుల నిర్మాణానికే కాక ప్రైవేట్ అవసరాలకు ఇక్కడి నుంచి మట్టి రవాణా చేస్తున్న కొందరు ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. అయినప్పటికీ మైనింగ్ అధికారులు, స్థానిక రెవెన్యూ, పోలీసు అధికారులు 'మామూలు'గా వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తోంది.

వందల సంఖ్యలో వాహనాలు

ప్రతీనిత్యం పలు గ్రామాల నుంచి వందల సంఖ్యలో లారీలు, టిప్పర్ల ద్వారా మట్టి రవాణా జరుగుతోంది. ఈ వాహనాల వేగంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అయినప్పటికీ పోలీసులు, రెవిన్యూ అధికారులు తనిఖీల మాటే ఎత్తడం లేదు. జమలాపురం, బుచ్చిరెడ్డిపాలెం, భీమవరం, బంజరలోని అటవీ ప్రాంత గుట్టల నుంచి అనుమతి లేకుండా మట్టి తరలిస్తుండగా.. రవాణాదారులకు ఓ పార్టీ నాయకులు సహకరిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇక రాజుపాలెం, మామునూరు, తాటిగూడెం, పెద్దగోపవరంల్లో గ్రావెల్ క్వారీల నిర్వహణకు అనుమతి ఉంది. ఇందులోని రాజుపాలెంలో ఇరవై ఏళ్ల కాలానికి లీజ్ ఉండగా మిగతావి తాత్కాలిక అనుమతితో కొనసాగుతున్నాయి. అయితే, అనుమతి ఉన్న క్వారీల్లోనూ నిబంధనలు పాటించడం లేదని.. పరిమితి మించి మట్టి తరలించడంతో పాటు నిర్దేశిత ప్రాంతాన్ని దాటి తవ్వుతున్నారని సమాచారం. ఫలితంగా ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది.

తనిఖీలు చేపడుతాం



మండలంలో రాజుపాలెం, తాటిగూడెం, పెద్దగోపవరం, మామునూరు గ్రామాల్లో నాలుగు చోట్ల 27 ఎకరాల నుంచి మట్టి తరలింపునకు అనుమతి ఇచ్చాం. ఇవికాక ఇంకెక్కడి నుంచైనా మట్టి తరలిస్తున్నట్లు ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకుంటాం. అంతేకాక మట్టి తరలింపునకు కట్టడి చేసేలా తనిఖీలు చేపడుతాం.
– ఎం.ఉషాశారద, తహసీల్దార్, ఎర్రుపాలెం

ట్రాక్టర్ బోల్తా పడి మైనర్ మృతి

తెల్లవారుజామున ఇసుక తరలిస్తుండగా ఘటన


వస్రాంనాయిక్ మృతదేహం

నేలకొండపల్లి: అనుభవం లేని మైనర్‌కు ట్రాక్టర్ అప్పగించడమే కాక ఇసుక అక్రమంగా తరలిస్తుండడంతో ప్రమాదవశాత్తు బోల్తా పడగా సదరు బాలుడు మృతి చెందాడు. సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం కొత్తగూడెంకు చెందిన వస్రాం నాయక్(17) ఆదివారం తెల్లవారుజామున ట్రాక్టర్‌లో ఇసుక తీసుకొస్తున్నాడు. ట్రాక్టర్ నేలకొండపల్లి మండలం బుద్ధారం శివారులో మూలమలుపు వద్ద వేగంగా ఉండడంతో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో టైర్ కింద పడిన వస్రాం అక్కడిక్కడే మృతి చెందాడు. కాగా, పోలీసుల తనిఖీలను తప్పించుకునేందుకు మండలంలోని పలు గ్రామాలకు తెల్లవారుజామున ఇసుక తరలిస్తున్నారు. అంతేకాక మైనర్లకు సైతం వాహనాలు ఇస్తుండడంతో ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. ప్రస్తుత ఘటనలోనూ బాలుడు మృతి చెందినందున అక్రమార్కులను కట్టడి చేయాలని పలువురు కోరుతున్నారు.

పాము కాటుతో రైతు...

- అరక దున్నుతుండగా ఘటన


వీరన్న (ఫైల్)

తిరుమలాయపాలెం: పొలం పనుల్లో నిమగ్నమైన రైతును పాముకాటు వేయగా మృతి చెందాడు. మండలంలోని పైనంపల్లికి చెందిన బొమ్మెనపల్లి వీరన్న (53) ఆదివారం పత్తి చేనులో అరక దున్నుతుండగా కాలు కింద పడిన పాము కాటు వేసింది. దీంతో ఆయన పామును చంపి గ్రామంలోకి వచ్చి కుటుంబీకులకు చెప్పగా ఖమ్మం తరలిస్తుండగా స్పృహ కోల్పోయాడు. అక్కడ ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కి తీసుకెళ్లేలోగా వీరన్న మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆయనకు భార్య మల్లమ్మ, కుమారుడు మహేష్, కుమార్తె హేమలత ఉన్నారు.

ఇది కదా మార్పు !


రెండేళ్ల క్రితం అంగన్‌వాడీ కేంద్రం..


ముస్తాబు చేశాక ఇలా...

ఒకప్పుడు పాత భవనం, ఆవరణలో గడ్డి, చెత్తా చెదారం, బురద నిలిచి అధ్వానంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రం.. ఇప్పుడు ప్రైవేట్ పాఠశాలను తలపించేలా సకల సౌకర్యాలతో ముస్తాబైంది. ఖమ్మం రస్తోగినగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రం రెండేళ్ల క్రితం అపరిశుభ్రంగా, సౌకర్యాల లేమితో ఉండేది. ఇటీవల భవనానికి రంగులు వేయించడమే కాక చిన్నారులను ఆకట్టుకునేలా బొమ్మలు గీయించారు. అలాగే, ఆవరణ శుభ్రం చేసి పిల్లలు ఆటవస్తువులు ఏర్పాటు చేశారు. దీంతో కేంద్రానికి వస్తున్న చిన్నారులు ఉత్సాహంగా గడుపుతున్నారు.
– స్టాఫ్ ఫొటోగ్రాఫర్

హైఓల్టేజీతో అగ్నిప్రమాదం..

రూ.లక్షల్లో ఆస్తి నష్టం


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 16వ డివిజన్ ఖమ్మం–బోనకల్లు రోడ్డు కొత్తూరులో ఆదివారం ఉదయం భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మూడంతస్తుల భవనంలోని మొదటి అంతస్తులో నివాసం ఉంటున్నాడు. ఆ ఇంట్లో విద్యుత్ హై ఓల్టేజీ కారణంగా షార్ట్ సర్క్యూట్ జరిగినట్లు తెలుస్తుండగా మంటలు చెలరేగాయి. దీంతో ఇంట్లోని ఫర్నీచర్, ఎలక్ట్రానిక్ సామగ్రి ఇతరత్రా పూర్తిగా కాలిపోవడంతో రూ.25 లక్షల మేర ఆస్తినష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. అగ్నిమాపక శాఖ సిబ్బంది చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చేలోగా సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. అయితే, ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇటీవలే వెంకట్ ఇల్లు నిర్మించుకోగా, ప్రస్తుత ప్రమాదంలో అంతా కాలిబూడిద కావడంతో ఆయన కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు.